సాక్షి చిత్తూరు

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



భక్త 'వైకుంఠం'

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం తిరుమల భక్తులతో కిటకిటలాడింది.

- 8లో



వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి శనివారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

- 8లో



డైట్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

కార్వేటినగరంలోని డైట్ సంస్థలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

- 8లో

న్యూస్‌రీల్

నేడు చౌడేపల్లెలో మంత్రి పెద్దిరెడ్డి పర్యటన



మంత్రి పెద్దిరెడ్డి

చౌడేపల్లె : మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొత్తం 14 పంచాయతీల్లో నిర్వహించనున్న అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి పాల్గొంటారని వెల్లడించారు. ఉదయం 7 గంటలకు పరికిదొన నుంచి మంత్రి పర్యటన ప్రారంభమవుతుందని, గడ్డంవారిపల్లె, కోటూరు, కొండామర్రి, వెంగళపల్లె, కాటిపేరి, లద్దిగం, 29 ఏ చింతమాకులపల్లె, కొండయ్యగారిపల్లె, బిల్లేరు, పెద్ద యల్లకుంట్ల, చౌడేపల్లె, చారాల , దుర్గసముద్రం, దాదేపల్లె, ఏ.కొత్తకోటలో కొనసాగుతుందని వివరించారు.

26న బయోమెట్రిక్ అథెంటికేషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ కన్ఫర్మేషన్ కోసం ఈ నెల 26వ తేదీన బయోమెట్రిక్ అథెంటికేషన్ చేసుకోవాలని డీఈఓ విజయేంద్రరావు ఆదేశించారు. శనివారం ఆయన మాట్లాడుతూ సంబంధిత హెచ్ఎంలు తప్పనిసరిగా ఆధార్ కార్డు, పాఠశాల యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ తీసుకురావాలని సూచించారు.

పారదర్శకంగా ఎన్నికల కసరత్తు



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఎన్నికల కసరత్తును పారదర్శకంగా చేపడుతున్నట్లు కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శనివారం విజయవాడ నుంచి ఎన్నికల కమిషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఎన్నికల కసరత్తును పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పక్కాగా ఓటర్ల తుది జాబితా తయారీకి పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈవీఎంల వినియోగంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కలిస్తున్నామన్నారు. యువ ఓటర్ల నమోదు సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసు శాఖ పరంగా చేపట్టిన కసరత్తును వివరించారు.

32 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదన



అధికారులకు సూచనలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో 32 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు త్రీ ఫేజ్ సరఫరా ఇవ్వడానికి సర్వే చేపట్టామన్నారు. వ్యవసాయానికి రైతులు వినియోగించిన విద్యుత్ లెక్క తెలుసుకునేందుకే డీబీటీ విధానం ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. దీంతో రైతాంగానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని, మొత్తం బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. ఈ క్రమంలోనే జిల్లా స్టోర్, రూరల్ ఈఆర్ఓ కార్యాలయ నూతన భవనాల నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. కార్యక్రమంలో ఈఈలు హరి, పద్మనాభపిళ్లై, డీఈఈలు జయప్రకాష్, శేషాద్రి, ఏఈ వివేకానందరెడ్డి పాల్గొన్నారు.



2022 సెప్టెంబర్‌లో కుప్పానికి నీరిస్తామని ప్రకటిస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)



గంగవరం మండలం పశుపత్తూరు వద్ద హంద్రీ-నీవా కాలువలో కుప్పం దిశగా ప్రవహిస్తున్న కృష్ణా జలాలు

మాటిచ్చారు.. నీళ్లిచ్చారు

నాయకుడంటే మాటకు కట్టుబడాలి.. పాలకుడంటే ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి.. ఇదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఒక్కసారి హామీ ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తున్నారు. వివక్షకు తావులేకుండా అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నారు. అందులో కులాలు.. మతాలు.. పార్టీల ప్రసక్తే లేకుండా ప్రతిపక్ష నేతల నియోజకవర్గాలను సైతం చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ నేత చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పానికి కృష్ణా జలాలు అందిస్తామని ప్రకటించారు. ఇచ్చిన మాట మేరకు హంద్రీ-నీవా ప్రాజెక్టు ద్వారా బుధవారం నీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. కరువు నేలను సస్యశ్యామలం చేసేలా కృష్ణమ్మ ఉప కాలువలో పుంగనూరు.. పలమనేరును దాటి పరుగులు తీస్తోంది. అతి త్వరలోనే కుప్పం వాసుల ఆకాంక్ష తీర్చేందుకు ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది.

- మరో హామీ నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- సంక్రాంతిలోపు కుప్పం నియోజకవర్గానికి చేరనున్న కృష్ణాజలాలు
- హంద్రీ-నీవా ద్వారా ఇప్పటికే పుంగనూరు.. పలమనేరును దాటిన నీరు
- దశాబ్దాలుగా కుప్పంవాసులకు మొండిచేయి చూపుతున్న చంద్రబాబు
- సాగు.. తాగునీటికి అలమటిస్తున్నా మాయమాటలతో కాలయాపన చేసిన వైనం
- టీడీపీ అధినేత మోసాలను ఎండగడుతున్న రైతులు

పలమనేరు/ పుంగనూరు/ కుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాటిస్తే ఎన్ని ఇబ్బందులొచ్చినా నిలబెట్టుకుంటారని ప్రజల ప్రగాఢ నమ్మకం. ఏడాది క్రితం కుప్పం పర్యటనలో భాగంగా 2023 డిసెంబరు నాటికి హంద్రీ-నీవా ద్వారా నీళ్లిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఆ మాటను నేడు నెరవేరుస్తూ విశ్వసనీయత మారుపేరుగా నిలిచారు. అయితే కుప్పం ఎమ్మెల్యేగా మూడు దశాబ్దాలకు పైగా ప్రాతినిధ్యం వహిస్తూ, ముఖ్యమంత్రిగా 14 ఏళ్ల అధికారంలో ఉన్నప్పటికీ చంద్రబాబు తన సొంత నియోజకవర్గానికి కృష్ణాజలాలు అందించడంలో విఫలమయ్యారు. కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పి కాలం గడిపేశారు.



కుప్పం ఉప కాలువలో కృష్ణా జలాలు

ఇదీ జగనన్న హామీ..

గత ఏడాది సెప్టెంబర్ 23వ తేదీన జగనన్న చేయూత రాష్ట్రస్థాయి కార్యక్రమం కుప్పంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. 2023 డిసెంబర్ నాటికి హంద్రీ-నీవా ద్వారా కృష్ణా జలాలు తీసుకువస్తామన్నారు. గుడుపల్లె మండలం యామిగానిపల్లె, శాంతిపురం మండలం మదినేపల్లె వద్ద రెండు రిజర్వాయర్లను నిర్మిస్తామన్నారు. కుప్పం బ్రాంచి కెనాల్ పనులను త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు. అంతే వేగంతో పనులు జరగడంతో నేడు అనుకున్న సమయానికి కుప్పానికి కృష్ణా జలాలు వడివడిగా వస్తున్నాయి. ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా ప్రజల తాగు.. సాగునీటి ఇక్కట్లు తీర్చేందుకు ముఖ్యమంత్రి తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతోనే కృష్ణమ్మ రాకకు మార్గం సుగమమైంది.

మారనున్న బతుకులు

ప్రస్తుతం హంద్రీ-నీవా ప్రాజెక్టు కింద కుప్పం ఉప కాలువ ద్వారా కృష్ణా జలాలు పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాలను దాటి కుప్పం వైపునకు కదులుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. చంద్రబాబు మోసాలను గుర్తుచేసుకుని మండిపడుతున్నారు. గతంలో పడిన తాగు.. సాగునీటి కష్టాలు ఇకపై ఉండబోవని సంతోషంగా చెబుతున్నారు. జగనన్న చలువతో తమ బతుకులు పూర్తిగా మారనున్నాయని వెల్లడిస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో అడుగంటిన బోర్లు సైతం ఉపయోగంలోకి వస్తాయని వివరిస్తున్నారు.

పసుపు డ్రామాలు



2019 మార్చి 5వ తేదీన గంగవరం మండలం గండ్రాజుపల్లె వద్ద పంపింగ్ చేసిన నీటికి జలహారతి పేరిట నాటకాలాడుతున్న అప్పటి సీఎం చంద్రబాబు (ఫైల్)

కుప్పం ప్రజల దశాబ్దాల కలను సాకారం చేస్తామంటూ చంద్రబాబు తరచూ ఊదరగొట్టేవారు. అదే క్రమంలో 2019 మార్చి 5వ తేదీన ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు మళ్లీ జనాలను ఏమార్చారు. అప్పటికి పలమనేరు వరకే హంద్రీ-నీవా పనులు అరకొరగా పూర్తయ్యాయి. కుప్పం ఉప కాలువ పనులు అర్ధాంతరంలోనే ఉన్నాయి. అయితే మోటార్లు పెట్టి పుంగనూరు మీదుగా పలమనేరు కాలువ వరకు నీరు వచ్చేలా ట్రయల్ రన్ చేయించారు. నిజంగానే హంద్రీ-నీవాలో నీరు ప్రవహిస్తోందంటూ ప్రజలను నమ్మించారు. తామే కృష్ణా జలాలను తీసుకువచ్చామంటూ హంగామా చేశారు. గంగవరం మండలం గండ్రాజుపల్లె వద్ద జలహారతి పేరిట గంగమ్మకు పూజలు చేశారు. నీటిలో పసుపు-కుంకుమ వేసి నాటకాలు ఆడారు. డ్వాక్రా మహిళలను పెద్దసంఖ్యలో అక్కడకు తరలించి ఆర్భాటాలు చేయించారు. దీంతో జనం సైతం చంద్రబాబు భలే గట్టోడు అంటూ ప్రశంసలు కురిపించారు. అయితే బాబుగారు వెళ్లిన మూడురోజులకే కాలువ నీరు లేక ఎండిపోయింది. అప్పటికి కానీ బాబు మోసం ప్రజలకు అర్థం కాలేదు. పచ్చడ్రామాలను కనిపెట్టిన ప్రజలు అప్పటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి అమరనాథరెడ్డిని ఘోరంగా ఓడించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడకు 33వేల భారీ మెజారిటీ కట్టబెట్టారు.

చిరస్థాయిగా నిలిచిపోతారు



కుప్పానికి శాశ్వతంగా సాగు, తాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కృష్ణాజలాలు తీసుకువస్తున్నారు. మేము ఇన్నేళ్లుగా మోసిన చంద్రబాబు మమ్మల్ని మోసం చేశారు. రైతుల అవసరాలను గుర్తించలేదు. గతంలో పాలారు ప్రాజెక్టును సైతం అడ్డుకుని కుప్పంవాసులను నట్టేట ముంచారు. ఇప్పుడు జగనన్న చలువతో మాకు సాగు, తాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఆయన ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. – రాధాకృష్ణ, రైతు, గుత్తార్లపల్లె, గుడుపల్లె మండలం

సంతోషంగా సాగు



మా ప్రాంతంలో వర్షాధారంతోనే పంటల సాగు చేపట్టేవాళ్లం. సమృద్ధిగా వర్షాలు కురిసి చెరువులు నిండితేనే సాగు లేకపోతే పొలాలు బీడు పెట్టుకోవాల్సి వచ్చేది. అయితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా సంతోషంగా సాగు చేసుకునే అవకాశం వచ్చింది. మా ఎమ్మెల్యే చంద్రబాబు మమ్మల్ని పట్టించుకోకపోయినా, జగనన్న ఎక్కడో 400 కిలోమీటర్ల అవతల ఉన్న కృష్ణా నది నీటిని కుప్పానికి తీసుకువస్తున్నారు. ఇకపై ఏడాది పొడవునా పంటలు సాగు చేసుకోవచ్చు. నిజమైన రైతుబాంధవుడు జగనన్నే. – చిన్నప్ప, ఊరునాయునిపల్లె, కుప్పం మండలం

అభినందనీయం



ఒక్కప్పుడు సాగు, తాగునీటి కోసం నానా అవస్థలు పడ్డాం. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కారణంగా హంద్రీ-నీవా కాలువలో నీరు రావడంతో చెరువులు నింపుకున్నాం. మాకున్న 11 ఎకరాల పొలంలో వరి, టమాట, చామంతి, బంతి సాగు చేపట్టాం. ప్రస్తుతం పుంగనూరు నుంచి కుప్పం కాలువకు విడుదల చేయడం అభినందనీయం. 14ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు చేయలేని పనిని కేవలం నాలుగున్నరేళ్లలో జగనన్న చేసి చూపించారు. కుప్పానికి నీరందించడం ముఖ్యమంత్రి నిజాయితీకి నిదర్శనం. – రాజారెడ్డి, గెరిగపల్లె, రైతు, పుంగనూరు మండలం

కరువన్నదే ఉండదు



హంద్రీ-నీవా ద్వారా ప్రభుత్వం కృష్ణా జలాలు అందించి మా జీవితాల్లో వెలుగులు నింపింది. కుప్పం వరకూ నీరందిస్తున్నారంటే ఇది రైతులందరికీ గొప్ప వరం. ఎన్ని ఎకరాలు ఉన్నా నీటి వసతిలేక పంటలు పండకపోతే ఆ భూమికి విలువే ఉండదు. బోర్లు ఉన్నా ఒక్కోసారి నీళ్లు ఉండవు. ఆ సమయంలో పంటలు పూర్తిగా ఎండిపోతాయి. జగనన్న చలువతో ఇకపై మా ప్రాంతంలో కరువన్నదే ఉండదు. పుష్కలంగా నీరు అందుబాటులో ఉండడంతో యథేచ్ఛగా పంటలు సాగు చేసుకోవచ్చు. – మంజునాథ్, రైతు, గండ్రాజుపల్లె, గంగవరం మండలం

నీటి సమస్య తీరుతోంది



హంద్రీ-నీవా కాలువ ద్వారా నీరు రావడం ఆనందంగా ఉంది. ఇక మా ప్రాంతంలో పంటల సాగుకు ఇబ్బంది ఉండదు. మాకు నాలుగెకరాలు ఉన్నాయి. కాలువ పక్కనే ఉండడం వల్ల ఒకప్పుడు నిరుపయోగంగా ఉన్న బోర్లు యాక్టివేట్ అయ్యాయి. చక్కగా కూరగాయలు సాగు చేసుకుని కుటుంబాన్ని సంతోషంగా పోషించుకోవచ్చు. గతంలో రైతులను చంద్రబాబు మోసం చేశారు. ఇప్పుడు జగనన్న పాలనలో మాకు సమృద్ధిగా నీరు వస్తోంది. ఇనేళ్లుగా వేధించిన నీటి సమస్య తీరుతోంది. – హరినాథరెడ్డి, రైతు, ఎర్రగుంట్లపల్లె, పుంగనూరు మండలం

రుణపడి ఉంటాం



పుంగనూరులో నీటి సమస్య ఉండటంతో వర్షాధార పంటలు మాత్రమే పండించేవాళ్లం. నాకున్న పది ఎకరాల పొలంలో ఒక పంట మాత్రమే పండేది. ప్రస్తుతం హంద్రీ-నీవా కాలువ, నేతిగుట్లపల్లె ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావడంతో మేము మూడు పంటలు పండించే వెసులుబాటు వచ్చింది.. ప్రస్తుతం వరి సాగు చేస్తున్నా. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికప్పుడు నీరు అందిస్తుండటంతో మాకు పంటల సమస్య తీరింది. రైతు సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – బాలకృష్ణారెడ్డి, రైతు, చిలకవారిపల్లె, పుంగనూరు మండలం

రైతుల ఆనందం



కుప్పం ప్రాంతంలోని రైతులు వ్యవసాయానికి పదుల సంఖ్యలో బోర్లు వేసి అప్పుల పాలయ్యారు. కొంత మంది తల్లిలాంటి పొలాలను వదిలి వలస వెళ్లిపోయారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి కృష్ణా జలాలను తీసుకువస్తుండడం సంతోషంగా ఉంది. కుప్పం కాలువకు నీరు వస్తే భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతుల కళ్లలో ఆనంతం తాండవిస్తుంది. 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు ఇప్పటి వరకు ఇక్కడి రైతులకు చేసింది శూన్యం. జగనన్నతోనే జనం ఆకాంక్షలు నెరవేరుతున్నాయి. – కదిరప్ప, ఊరునాయునిపల్లె, కుప్పం మండలం

క్రీడాస్ఫూర్తి పెంచేలా 'ఆడుదాం'



ర్యాలీ నిర్వహిస్తున్న యువత

చిత్తూరు కలెక్టరేట్ : యువతలో క్రీడాస్ఫూర్తి పెంచేలా ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి తెలిపారు. శనివారం యువజన విభాగం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చిత్తూరులోని వివేకానంద సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఈ నెల 26వ తేదీ న రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించినట్లు వెల్లడించారు. గ్రామీణ క్రీడాకారులలో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గుర్తింపు లేని క్రీడాకారులను ప్రోత్సహించి పైకి తీసుకురావడమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. పోటీల్లో క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో తదితర క్రీడలు ఉన్నాయని వివరించారు. విజేతలకు రూ.కోట్ల బహుమతులను ప్రభుత్వం అందించనునందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో యువత 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ధరనీష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మురళీ రెడ్డి, మహేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు జ్ఞానేంద్ర రెడ్డి, సుబ్రమణ్యం నాయుడు, కార్తీక్, భార్గవ్, శరత్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం చిత్తూరు, కుప్పం నియోకవర్గాలకు యువజన విభాగం మండల అధ్యక్షులను నియమించారు. చిత్తూరు క్లస్టర్-1కు మనోజ్‌రెడ్డి, క్లస్టర్-2 సాయిగణేష్ (అప్పు), చిత్తూరు రూరల్- స్టాండ్లీ, గుడిపాల- సిలంబరసన్, గుడుపల్లె-మురళి, కుప్పం రూరల్- దౌలత్‌బాషా, రామకుప్పం- కేజే యశ్వంత్‌రెడ్డి, శాంతిపురం- జగదీష్‌నాయుడు, కుప్పం మున్సిపాలిటీకి జతిన్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైనిక నిధి విరాళాలకు పన్ను మినహాయింపు



విజయశంకర్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : సైనిక పతాక నిధికి అందజేసే విరాళాలకు ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటుందని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి విజయశంకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ సైనికుల కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక నిధికి విరాళాలు సేకరిస్తున్నామన్నారు. విరాళాలు అందజేసే వారు నేరుగా జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గిరింపేట అకౌంట్ నంబర్ 62125384416లో జమచేయవచ్చని సూచించారు. జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో నేరుగా చెల్లించి రశీదు పొందే వెసులుబాటు ఉందని తెలిపారు. వివరాలకు 8688817824, 7382407242 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

విద్యార్థి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం


చెక్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

యాదమరి: మండలంలోని కీనాటంపల్లె దళిత వాడలో రెండు రోజుల క్రితం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన అభి అనే విద్యార్థి కుటుంబానికి ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం శనివారం రూ.5లక్షల పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, సీఈఓ ప్రభాకర్ రెడ్డి, విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కృష్ణారెడ్డి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ హరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, సర్పంచ్ డానివేలు పాల్గొన్నారు.


అశేష భక్తజనం నడుమ స్వర్ణరథంపై మాడవీధుల్లో విహరిస్తున్న శ్రీమలయప్పస్వామి


శ్రీవారి సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి

భక్త వైకుంఠం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తుల రద్దీతో తిరుమలలో సందడి నెలకొంది. తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు బారులు తీరడంతో పుణ్యక్షేత్రం జనసంద్రమైంది. భక్తుల గోవిందా నామస్మరణలతో మార్మోగింది. తిరుమలలో శనివారం తెల్లవారుజామున 1:45 గంటలకు వైకుంఠ ద్వారాలు తెరుచుకున్నాయి. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు శ్రీవారిని వైకుంఠ ద్వారం దర్శనం చేసుకుని పులకించారు. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారు స్వర్ణరథంపై అధిరోహించి నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. – తిరుమల


విశేష పుష్పాలంకరణ నడుమ శ్రీరంగనాథస్వామివారు

వరసిద్ధుని సేవకు పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిన క్యూ

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి భక్తులు శనివారం పోటెత్తారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేకువనుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. క్యూలు నిండిపోవడంతో వెలుపల వరకు బారులు తీరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు పకడ్బందీ ఏర్పాట్లు చేయించారు. వృద్ధులతోపాటు చంటి బిడ్డల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూ ద్వారా స్వామివారి దర్శనం కల్పించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గురుకుల విద్యార్థులు

బంగారుపాళెం: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లా రేణిగుంటలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన క్రీడాకారులు సత్తా చాటినట్లు వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులు, పీఈటీ రాజేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.


క్రీడాకారులతో ఉపాధ్యాయులు

శ్రీవారి సేవలో ప్రముఖులు




శ్రీవారి దర్శనానంతరం ఆలయం వెలుపల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా






ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, తిరుపతి ఎంపీ గురుమూర్తి

డైట్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కార్వేటినగరం: డైట్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి కొవ్వొత్తులు వెలిగించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ కుల,మతాలకతీతంగా చాత్రోపాధ్యాయులు అన్ని రకాల పండుగలను వైభవంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అన్ని మతాలపై సమభావన కలిగి ఉండడం, పరమత సహనాన్ని కలిగి ఉండడం తదితర లక్షణాలను పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ చాత్రోపాధ్యాయుడు క్రిస్మస్‌తాత వేషధారణలో ఆకట్టుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, డైట్ అధ్యాపకులు చాత్రోపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థన చేస్తున్న ప్రిన్సిపల్ శేఖర్ తదితరులు